క్లుప్తంగా...

హోంమంత్రికి ఆహ్వానం



నాంపల్లి: ఈనెల 16న జరిగే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ రాష్ట్ర హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీకి ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం నాంపల్లి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్, నేతలు అశ్విన్ మార్గం, ప్రదీప్ అగర్వాల్, సంజయ్, మరళి, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో నూతన విద్యా కోర్సులు

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాలలో ఈ విద్యా సంవత్సరం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భీమనాయక్ తెలిపారు. మంగళవారం నిజాం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ సహకారంతో బాలబాలికల వసతి గృహాలను అందుబాటులోకి తీసుకువచ్చామని త్వరలో మరో తరగతి గదుల భవన సముదాయానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 60 సీట్లతో బీఎస్సీ కంప్యూటర్స్, బీబీఏ రిటైల్ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పలు కోర్సులకు సీట్ల సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ విభాగం అధికారి జ్యోతి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గీత, పీఆర్ఓ ప్రజా సంబంధాల అధికారి పరందాములు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీకాంత్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్

అబిడ్స్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూపీహెచ్‌సీ కార్వాన్ మెడికల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్‌కు ఉత్తమ అవార్డు లభించింది. కరోనాలో సైతం ప్రాణాలను లెక్క చేయకుండా ఉత్తమ విధులు నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్ సేవలు గుర్తించి ప్రభుత్వం ఉత్తమ యూపీహెచ్‌సీ మెడికల్ అధికారిగా అవార్డు అందజేసింది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ ఉన్నతాధికారులు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకట్, ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ అనురాధలు డాక్టర్ శ్రీకాంత్‌కు అవార్డును అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సరిత, ఏఎన్‌ఎమ్ జహంగీర్‌బీ, సునిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ అన్నపూర్ణకు ఉత్తమ వైద్యాధికారి అవార్డు



గౌలిపురా: అలియాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పొన్నం అన్నపూర్ణ ఉత్తమ వైద్య అధికారిణి అవార్డు, ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జంగమ్మెట్ క్లస్టర్ నుంచి ఉత్తమ వైద్యాధికారిణి అవార్డును అన్నపూర్ణకు అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అందజేశారు. ఆమెకు వైద్యులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలి

చార్మినార్: బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సంబంధిత ఉత్సవాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య సూచించారు. మంగళవారం రాత్రి ఉప్పుగూడలోని మహంకాళి ఆలయాన్ని ఆయన సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్‌గౌడ్ ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7న కలశస్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలకు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయన్నారు. దక్షిణ మండలం పరిధిలోని ఆలయాల వద్ద తగిన బందోబస్తు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న డీసీపీ సాయి చైతన్య

వైభవంగా బోనాల వేడుకలు



అబిడ్స్: గోషామహల్‌ని వాటర్‌బోర్డు పోచమ్మ ఆలయంలో మంగళవారం పెద్ద ఎత్తున బోనాల వేడుకలు నిర్వహించారు. వాటర్‌బోర్డు సంఘం నాయకులు రాములు ఆధ్వర్యంలో బోనాల వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంట్రాక్టర్స్ జేఏసీ సెక్రటరి పోల్కం శ్రీనివాస్, వాటర్‌బోర్డు అధికారులు వినోద్‌భార్గవ్, అరుణకుమారి, రమాకాంత్, కనకయ్యలు పూజలు చేశారు.

బోనాల పండగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక..

సుల్తాన్‌బజార్: బోనాల పండగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని టీఎన్జీఓస్ అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి శ్రీనివాస్ అన్నారు. టీఎన్జీఓస్ డీఎంహెచ్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం కోఠి డీఎంహెచ్‌ఎస్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. పోతరాజుల ఆటలతో, బ్యాండ్ మేళాల హోరులో పోతరాజుల ఆటలతో మహిళా ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల కుటుంబాలు పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఎస్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు మామిడి ప్రభాకర్, హరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి టీఎన్జీఓస్ డీఎంహెచ్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బోనాల పండగను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. టీఎన్జీఓస్ నాయకులు శ్రీకాంత్, యూనిట్ కోశాధికారి, క్రాంతికిరణ్, చక్రధర్, చంద్రశేఖర్, ప్రభాకర్, బాబుశంకర్, జగ్‌పాల్ సింగ్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో..

గన్‌ఫౌండ్రీ: బోనాలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెస భీమనాయక్ అన్నారు. మంగళవారం నిజాం కళాశాలలో నాగదేవత, ఎల్లమ్మ దేవతలకు పూజలు చేసి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, కళాశాల బోధన, బోధనేత సిబ్బంది పాల్గొన్నారు.

గౌలిగూడలో..

అఫ్జల్‌గంజ్: బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం గౌలిగూడ ప్రాంతంలోని ఇంబ్లీబన్ ధోబీఘాట్‌లో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు ఆలయ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ చైర్మన్లు కనకయ్య, లచ్చయ్యలు, సెక్రటరీలు ఆర్.సాయిచంద్, వెంకటేష్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



బోనాల వేడుకల్లో ప్రిన్సిపాల్ భీమనాయక్ తదితరులు



వాటర్‌బోర్డు కార్యాలయంలో పోల్కం శ్రీనివాస్



ఆలయ ప్రతినిధులను సన్మానించిన నిర్వాహకులు

26 ఆలయాలకు పట్టువస్త్రాలు సమర్పిస్తాం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఆలయాల నిర్వాహకులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి తలసాని

సుల్తాన్‌బజార్: మన సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేవి పండగలని, వాటిని గొప్పగా జరుపుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కార్యాలయంలో బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కింద గోషామహల్, మలక్‌పేట్ నియోజకవర్గాల పరిధిలోని 301 ఆలయాలకు రూ.89.60 లక్ష విలువైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని, ఉత్సవాలకు ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లు చేస్తూ వస్తుందని వివరించారు. ఈ సంవత్సరం రూ.15 కోట్లను విడుదల చేసిందని తెలిపారు. 26 ఆలయాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. 17న ఉమ్మడి ఆలయాల ఆధ్వర్యంలో నిర్వహించే ఊరేగింపునకు కూడా ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా అన్ని చర్యలు చేపట్టనునట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, సురేఖ, శంకర్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, పరమేశ్వరీ సింగ్, నాయకులు నందకిశోర్ వ్యాస్, సంతోష్‌గుప్తా, ఆనంద్‌కుమార్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

16న జియాగూడ మహంకాళి గాజులమ్మ తల్లిగా దర్శనం

జియాగూడ: ఈనెల 16న జరిగే బోనాల వేడుకల్లో జియాగూడ మహంకాళిని గాజులమ్మతల్లిగా అలంకరించి భక్తులకు దర్శన సౌభాగ్యం కల్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గౌడుగు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం జియాగూడ మమంకాళి స్ట్రీట్‌లో గల ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఆలయ అర్చకులు భరద్వాజశర్మతో కలిసి మాట్లాడారు. జియాగూడ ఇలవేల్పుగా పేరుగాంచిన మహంకాళి మాతేశ్వరీ ఆదివారం జరిగే బోనాల రోజున పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, సామూహిక బోనాలు, తొట్టెల ఊరేగింపు, అఖండ హారతి, సోమవారం మాతేశ్వరి పలహారం బండి ఊరేగింపు ఉంటుందన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయించాలి



కమిషనర్ రొనాల్డ్ రాస్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన బల్దియా కమిషనర్ రొనాల్డ్ రాస్‌ను కలిసి కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధి, పెండింగ్ పనులు, ముంపు నివారణ తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన కొత్త అభివృద్ధి పనుల ప్రతిపాదనలను కూడా బల్దియా కమిషనర్‌కు అందించారు. హకీంపేట్‌లో లోటస్ పాండ్‌కు వెళ్లే రోడ్డు వద్ద జరుగుతున్న డ్రైనేజీ పనులు మరో 200 మీటర్లు హకీంపేట్ వరకు పొడిగించాలని కోరారు. కేంద్రీయ విద్యాలయ నెం.1, మర్కాస్ ప్రధాన కార్యాలయం వద్ద ఎస్‌పీ-3 పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని, ఈ ప్రాంతంలో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతుందన్నారు. హకీంపేట్ జియా స్కూల్, హకీంపేట్ ఫైరింగ్ రేంజ్, టోలిచౌకి విరాసత్ నగర్, అక్బర్‌పురా, హాతిమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో సీసీ, వీడీసీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. కార్వాన్ డివిజన్‌లోని నేతాజీనగర్, ఓం నగర్‌లలో ప్రధాన రహదారులను కలుపుతూ సబ్ రోడ్డు వేయాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే కౌసర్‌కు బల్దియా కమిషనర్ హామీ ఇచ్చారు.

కేంద్రీయ విద్యాలయ అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం



గోల్కొండ: కేంద్రీయ విద్యాలయం హైదరాబాద్ రీజియన్ అథ్లెటిక్స్ మీట్ మంగళవారం ప్రారంభమైంది. ఈ క్రీడోత్సవాలకు ఆర్టిలరి సెంటర్‌కు చెందిన బ్రిగేడియర్ గణేష్ నాగరాజన్-వైఎస్ఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడలకు ఆతిథ్యం ఇస్తున్న కేంద్రీయ విద్యాలయం నెం.2 ప్రిన్సిపాల్ జయా రాజప్పన్ మాట్లాడుతూ... ఈ అథ్లెటిక్స్ మీట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 600 మంది అథ్లెట్స్ పాల్గొంటున్నారన్నారు. కేంద్రీయ విద్యాలయం హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ రెజీ వీఆర్ నాక్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయ హోమం

గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోటమైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సురేశ్‌గౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎస్.మల్లేషం గౌడ్, కె.ఎస్.ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మధుసూదన్‌గిరి, సుమన్‌కుమార్ ముదిరాజ్, బి.వై.శ్రీకాంత్, బొడ్డు సాయిబాబా, వై.రామకృష్ణ, రాముగౌడ్ తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మృత్యుంజయ హోమంలో పాల్గొన్న సురేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులు, కమిటీ ప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి కృషి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని రాజ్‌పాల్‌నగర్‌లో ఆమె రూ.10 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. రాజ్‌పాల్‌నగర్‌లో రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. డివిజన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. గౌలిపురా డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రఘుకాంత్, సుమన్‌కుమార్ ముదిరాజ్, అర్జున్ ఆర్య, రమేశ్‌యాదవ్, అశోక్, రాజ్‌కుమార్, అభిజిత్ కులకర్ణి, భాస్కర్, వికాస్ పాల్గొన్నారు.

నియామకం



రామకృష్ణ శాస్త్రి

చార్మినార్: పాతబస్తీ శివాజీనగర్ రాజన్నబావి నివాసి యోగా నిపుణులు, ప్రముఖ సంఘ సేవకుడు, ఆర్య సమాజ్ సభ్యులు సంఘనటోయిన రామకృష్ణ శాస్త్రి తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ పాతబస్తీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బుధవారం టీసీసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో రామకృష్ణ శాస్త్రికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం. రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ శాస్త్రికి పలువురు కార్యవర్గ సభ్యులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

హత్య కేసులో రౌడీషీటర్‌కు రిమాండ్

దబీర్‌పురా: హత్య కేసులో ఓ రౌడీషీటర్‌ను రెయిన్‌బజార్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మౌలాకా చిల్లాకు చెందిన షేక్ పర్వేజ్ (23) ఫుట్‌పాత్‌పై బట్టల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. ఈనెల 7న షేక్ పర్వేజ్ విధులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో రౌడీషీటర్ అక్బర్ (26) పర్వేజ్‌తో అనవసరంగా గొడవకు దిగి తన వద్ద ఉన్న కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన షేక్ పర్వేజ్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రౌడీషీటర్ అక్బర్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో నల్లపోచమ్మ ఘటం ఊరేగింపు



గోల్కొండ: సబ్జిమండిలోని నల్లపోచమ్మ, మహంకాళి ఆలయ ఘటం ఊరేగింపు మంగళవారం వైభవంగా జరిగింది. టప్పాచబుత్ర, లోధ్ క్షత్రియనగర్, మల్లై మెట్ నటరాజ్‌నగర్, కుమ్మరివాడి తదితర వీధుల గుండా సాగిన ఘటం ఊరేగింపునకు అన్ని ప్రాంతాల్లో ప్రజలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్యాట నందకిషోర్, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కుదుముల రాకేష్, కోశాధికారి కట్టా శ్రీనివాస్, జి. అశోక్ కుమార్, ఎస్. చంద్రశేఖర్, బి.వేణుకుమార్, మామిడి మల్లేష్, కట్టా స్వామి, చింత జయరాం పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఒడిబియ్యం, పట్టువస్త్రాల సమర్పణ



ఒడిబియ్యం, పట్టువస్త్రాలు సమర్పిస్తున్న శ్రీనివాస్‌గుప్తా, జీవన్‌సింగ్, మిత్రకృష్ణ తదితరులు

జియాగూడ: జియాగూడ ప్రజలు ఎల్లవేళల మాతేశ్వరీల దీవెనలు పొంది సుఖశాంతులతో ఉండాలని, ప్రతియేటా ఒడిబియ్యం, పట్టువస్త్రాలను సామూహికంగా ఊరేగింపుగా వెళ్లి సమర్పించడం హర్షణీయమని తెలంగాణ పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ జీవన్‌సింగ్, జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ, పరమేశ్వరీసింగ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జియాగూడ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ మిత్రకృష్ణ ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి మాతేశ్వరీ ఫలహారం బండి ఒడిబియ్యం, పట్టువస్త్రాలతో లక్ష్మీనరసింహనగర్, బంగారు మైసమ్మ, దుర్గానగర్ తుల్జాభవాని, జియాగూడ మహంకాళి, ఇందిరానగర్ నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, సంజయ్‌నగర్ నల్లపోచమ్మ ఆలయాలకు ఊరేగింపుగా పోతరాజు నృత్యాలతో వెళ్లి సమర్పించారు. నర్మద, నరహరిచారి, శ్రీనివాస్‌గుప్తా, అభిషేక్ మిత్ర, సంగీత, అనిత, కిశోర్‌కుమార్, రాజేష్, సుకన్య, శంకర్‌రావు, శంకర్ సింగ్, రఘునాథ్, సంతోషి, కేశవ్‌కుమార్, పాలెం వెంకటేష్, ఉమేష్, దిలీప్‌కుమార్, కె.నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్‌కు ఆదరణ



నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పలు పార్టీల నాయకులు

అబిడ్స్: సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్‌కు ఆదరణ పెరిగిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్‌వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు పార్టీలకు చెందిన వారు నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. అభివృద్ధి, ప్రగతి, సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ నెంబర్:1 స్థాయిలో ఉందన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్ఠ పరుస్తున్నట్లు వెల్లడించారు. అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో పరిష్కరిస్తుననట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కోటి శైలేష్‌కురుమ, పప్పుమాత్రే టింకు, జగపతిసాయి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

చార్మినార్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని హరిబౌలి గజానంద్ వ్యాయామశాల వద్ద ఉన్న పోచమ్మ మహంకాళి ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమార్చన జరిగింది. అలాగే లలిత సహస్రనామం, విశిష్ట సహస్రనామం తదితర పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు పాల్గొని పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దినేష్, శ్రావన్‌కుమార్, గోపాల్‌యాదవ్, సుశీల్, అభినవ్, మున్నా, శ్రీను పాల్గొన్నారు.



సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన పూజలు



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. పూజల సందర్భంగా భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉత్సవాల నిర్వాహకులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అనంతరం పంచ హారతి, సామూహిక హారతి కార్యక్రమాలు జరిగాయి.

అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌జేడీ జయప్రదకు వినతిపత్రం అందజేస్తున్న శివరాత్రి ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి

నాంపల్లి: అనుమతులు లేని శ్రీ చైతన్య, నారాయణ రిసోనెన్స్, ఎస్.ఆర్, గాయత్రి, ఫిట్జీ, దీక్షా, 9-ఎడ్యుకేషన్, నానో, ప్రగతి జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌జేడీ జయప్రదకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంస్థలు ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా మాదాపూర్, కూకట్‌పల్లి, హైదర్‌గూడ, బౌరంపేట, కొల్లూరు, పాటి, మల్లాపూర్, నార్సింగ్, ఒట్టినాగులపల్లి, బాచుపల్లి, మియాపూర్ ప్రాంతాలలో కొనసాగుతున్నట్లు వివరించారు. ఈ కళాశాలల్లో ఒక్కో విద్యార్థి నుంచి సుమారుగా రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. నేతలు శ్రీనివాస్‌రెడ్డి, నాగయ్యగౌడ్, రాజేష్, నాగయ్య పాల్గొన్నారు.

మంగళ్‌హాట్ డివిజన్ బీఆర్‌ఎస్ కో ఆర్డినేటర్‌గా శ్రీనివాస్‌యాదవ్



శ్రీనివాస్‌యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: మంగళ్‌హాట్ డివిజన్ బీఆర్‌ఎస్ కో ఆర్డినేటర్‌గా జి.శ్రీనివాస్‌యాదవ్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆదేశాలు జారీచేసి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. డివిజన్ నలుమూలలా అందరిని కలుపుకుని పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. డివిజన్‌లోని బస్తీలు, మురికివాడల్లో ప్రతిరోజూ పర్యటించి ప్రజా సమస్యలను ఇన్‌చార్జ్ నందకిశోర్‌వ్యాస్, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌సింగ్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయనగర్‌కాలనీ: యూనివర్సిటీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ హామీ ఇచ్చారు. యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న క్యాంటిన్‌ను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తేవడంతో పాటు స్పోర్ట్స్‌ను సక్రమంగా నిర్వహించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం విద్యార్థి సంఘం నాయకులు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు భరత్‌కుమార్, వంశీకృష్ణ, దినేష్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.



సుందర్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ వైద్యులకు నగదు ప్రోత్సాహకాలు అందించాలి



ఉస్మానియాలో నిరసన వ్యక్తం చేసిన ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ప్రభుత్వ వైద్యులకు నగదు ప్రోత్సాహకాలు అందించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఉస్మానియా ఆస్పత్రి శాఖ అధ్యక్షుడు డాక్టర్ రంగా అజ్మీరా డిమాండ్ చేశారు. సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ లీగల్ అధ్యక్షుడు డాక్టర్ పల్లం ప్రవీన్, ఉస్మానియా శాఖ ప్రతినిధులు డాక్టర్లు లక్ష్మీనారాయణ, రాణి, రవి, శివరామ్, అక్బర్, పవన్ కుమార్, ప్రదీప్‌తో కలిసి మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్న ప్రభుత్వం అక్కడ సరైన సదుపాయాలు, వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో పేద రోగులకు వైద్య సేవలు ఏ విధంగా అందించాలని ప్రశ్నించారు. వైద్యుల వేతన సవరణ, పాత బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ అమోద ముద్ర వేసినా ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బంది అడ్డుపడుతుండటంతో వైద్యులకు తీరని అన్యాయం జరుగుతుందని వాపోయారు. నెలలోపు వైద్యుల సమస్యలను తెలంగాణ ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు పాత భవనం వద్ద ప్రభుత్వ వైద్యులు తిమ్మారెడ్డి, రంగా అజ్మీరా, రాణి, పల్లం ప్రవీణ్‌లతో పాటు పీజీ వైద్యులు నిరసన వ్యక్తం చేశారు.